సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



25 నుంచి నీటి విడుదల

యాసంగి పంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు.

- 8లో ▸



నేల సంరక్షణ అందరి బాధ్యత

నేల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /20.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అవినీతిని నిర్మూలించాలి



ఖలీల్‌వాడి: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒకరూ కృషి చేయాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ అన్నారు. అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 11 గంటలకు పాత కలెక్టరేట్ వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇన్‌చార్జి సీపీ మాట్లాడుతూ ఎవరైనా ఉద్యోగులు లంచం అడిగితే బాధితులు వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ కోటేశ్వర రావు, ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్, ఏసీపీ రాజా వెంకట రెడ్డి, ఏసీబీ సిబ్బంది, నిజామాబాద్ టౌన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో కాల్ సెంటర్



ఖలీల్ వాడి: జిల్లా ప్రజలకు సీపీ ఆఫీస్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ గురువారం తెలిపారు. జిల్లా ప్రజలు కాల్ సెంటర్ నెంబర్ 8712659888 ను సంప్రదించాలన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఫిర్యాదు ఉన్నా సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు. అక్కడ ఫి ర్యాదు పై చర్యలు తీసుకోని పక్షంలో సంబంధిత సీఐకి ఫిర్యాదు చేయాలని తెలిపా రు. అక్కడ కూడా చర్యలు తీసుకోని పక్షంలో సంబంధిత ఏసీపీకి ఫిర్యాదు చేయాలని, అక్కడ కూడా తగిన స్పందన లేనట్లయి తే చివరికి పోలీస్ కమిట్ కార్యాలయంలోని సెంట్రల్ కాంప్లెంట్స్ సెల్ నెంబర్ 8712659888 ను సంప్రదించాలని తెలిపారు.

సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హుల గుర్తింపు కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సీఎం గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు వీక్షించారు. కనీసం 400 చదరపు అడుగుల స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునేలా, ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో నాలుగు విడతల్లో జమ చేస్తుందని సీఎం అన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ వసతి గృహాలను గురువారం రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ మెంబర్ జ్యోత్స్న తనిఖీ చేశారు. ఇందల్వాయిలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, ధర్మారంలోని సాంఘిక సంక్షేమ శాఖల వసతిగృహం, కోటగల్లిలోని శంకర్ భవన్ పాఠశాలను, మునిపల్లిలోని జ్యోతిబాఫూలే హాస్టల్, ఆర్మూర్‌లోని బీసీ హాస్టల్, పోచంపాడ్‌లోని రెసిడెన్షియల్ గురుకుల బాలుర, బాలికల వసతి గృ హాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను వంటగదులను తనిఖీ చేశారు. బియ్యం, కూరగాయల నాణ్యతలను తనిఖీ చేశారు. డీఈవో అశోక్, ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి ఉన్నారు.

జిల్లాకు ప్రొబెషనరీ ఐపీఎస్

ఖలీల్‌వాడి: పోలీస్ అకాడమీ నుంచి జిల్లాకు ప్రొబెషనరీ నిమిత్తం సాయికిరణ్ పత్తిపాక వచ్చినట్లు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 76 ఆర్ఆర్ (2023) బ్యాచ్‌కు చెందిన సాయికిరణ్ వరంగల్‌కు చెందినవారు. బీఈ (సివిల్)ఇంజినీర్, ఎంబీఏ చేశారు. జిల్లాలో 29 వారాల పాటు శిక్షణలో ఉంటారని పేర్కొన్నారు.

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి

- రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావాలి !
- జిల్లాకు కేబినెట్ బెర్త్ లేకపోవడంతో అభివృద్ధికి ఆటంకం
- ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వే లైన్ కోసం కృషి
- అమృత్ పథకం కింద ఆర్మూర్‌కు రూ.43 కోట్లు
- రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ తెచ్చుకున్న ఏకైక ప్రతిపక్ష ఎమ్మెల్యేని నేనే..
- కేంద్ర మంత్రి గడ్కరీ ద్వారా సెంట్రల్ రోడ్ ఫండ్ రూ.30 కోట్ల నిధులకు ప్రయత్నాలు
- నా హయాంలో ఆర్మూర్ నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది
- ఆర్మూర్‌లో స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తే గల్ఫ్‌లో ఉన్నత ఉద్యోగావకాశాలు
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి

ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని, ఎన్నికలయ్యాక మాత్రం అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు కలసికట్టుగా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి పాటుపడాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అనే మాదిరిగా ఆయా ప్రాంతాల నాయకుల మధ్య గొడవ పెట్టేలా ఉన్నత స్థాయిలో ఉన్న నేతలు వ్యవహరించొద్దన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా 'సాక్షి' ఇంటర్వ్యూలో రాకేశ్‌రెడ్డి పలు విషయాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకునే విషయంలో పక్షపాత ధోరణి సరి కాదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాగా ఇప్పటివరకు నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు కేబినెట్‌లో స్థానం కల్పించకపోవడంతో అభివృద్ధిలో సమతుల్యత లోపిస్తోంది. దీంతో ప్రాంతాల మధ్య అంతరాలు పెరిగిపోయే పరిస్థితి వచ్చింది. ఇది సరైన పద్ధతి కాదు. అధిక నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులు కొడంగల్, మహబూబ్‌నగర్ ప్రాంతాలకే తీసుకెళ్లడం చూస్తుంటే పరిస్థితి అర్థమవుతోంది. ఇక ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల పట్ల వివక్ష సరికాదు. కొడంగల్ నియోజకవర్గానికి ఇచ్చిన పథకాలన్నీ ఇవ్వాలని అడుగుతా.

✤ రాష్ట్రంలో ఏ ప్రతిపక్ష ఎమ్మెల్యే నియోజకవర్గానికి రాని ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను తీసుకొచ్చాను. మాక్లూర్ నర్సింగ్ కళాశాలకు రూ.15.50 కోట్ల నిధులు తీసుకొచ్చాను. పాఠశాలల అదనపు గదులు, సైన్స్ ల్యాబ్‌ల కోసం రూ.1.17 కోట్ల సమగ్ర శిక్ష నిధులు తీసుకొచ్చాను. అమ్మ ఆదర్శ పాఠశాలల నిధులు రూ.6 కోట్లు తెచ్చాను. ఆర్మూర్ బాలికల ఉన్నత పాఠశాల, మినీ స్టేడియం, శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు తెచ్చాను.

✤ అధికారిక సమీక్షల్లో ఓడిన వారిని కూర్చోబెట్టుకునే పద్ధతి మానుకోవాలి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రులే ఇలా వ్యవహరిస్తే ఎలా? ఈ విషయమై శాసనసభలో ప్రస్తావిస్తా. నాపై ఓడిన వ్యక్తిని అధికారిక సమీక్షలో కూర్చోబెట్టుకోవడమంటే ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలను అవమానించినట్లే. కేబినెట్ సమీక్షల్లో రేవంత్ సైతం కేసీఆర్‌ను పక్కన కూర్చోబెట్టుకుంటారా? రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదనేది గుర్తుంచుకోవాలి. గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ఏడాది కాలం నుంచి ఆర్మూర్ నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది. ఎలాంటి అక్రమ కేసులు బనాయించడం లేదు.

✤ ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వే లైన్ కోసం మా ఎంపీల ద్వారా కృషి చేస్తున్నా. దీనిపై పార్లమెంటులో చర్చ వచ్చింది. అదేవిధంగా జిల్లా అభివృద్ధి కోసం జక్రాన్‌పల్లి విమానాశ్రయం అవసరం. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేయాలి. లక్కంపల్లి సెజ్‌ను ప్రమోట్ చేసుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది.

✤ డొంకేశ్వర్ డిగ్రీ కళాశాల కోసం ప్రతిపాదనలు పంపి శాసనసభలో మాట్లాడాను. ప్రతి మండలానికి జూనియర్ కళాశాల అడిగాను. మాక్లూర్‌లో బాలికల డిగ్రీ కళాశాల, నందిపేటలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను నిర్మించాలని ప్రతిపాదనలు పెట్టాను.

✤ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ద్వారా పిప్రి–మంథని, అలాగే గుత్ప–ఆలూరు రోడ్ల కోసం రూ.30 కోట్లు మంజూరు చేయించాను. కేంద్రం నుంచి మరో రూ.50 కోట్ల నిధులు తీసుకొస్తా. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వాలి. నాగ్‌పూర్ హైవే (మెంట్రాజ్‌పల్లి) నుంచి గుంజిలి వరకు డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు పెట్టాను. దీనివల్ల నందిపేట, జన్నేపల్లి వరకు హైవేతో కనెక్టివిటీ పెరుగుతుంది.

✤ ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వలస వెళుతున్న వారి నైపుణ్యాభివృద్ధి కోసం అందరికీ అందుబాటులో ఉన్న ఆర్మూర్‌లో స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. కల్వకుర్తిలో పెట్టిన మాదిరిగా ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించాను. నైపుణ్యం పెంచుకుంటే గల్ఫ్‌లో మరిన్ని ఉన్నత అవకాశాలు కలుగుతాయి. అందుకే నిష్ణాతులను తయారు చేయాలి.

✤ ఆర్మూర్ నియోజకవర్గానికి అమృత్ పథకం కింద కేంద్రం నుంచి రూ.43 కోట్లు తెచ్చాను. అంకాపూర్,మునిపల్లి,లక్ష్మాపూర్ రోడ్డుకు, అలాగూ డొంకేశ్వర్, నూత్‌పల్లి రోడ్డుకు రూ.5 కోట్లు మంజూరు చేయించాను. అన్ని గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా డ్రైయిన్లు, సీసీ రోడ్లకు నిధులు వచ్చాయి.

✤ చిన్నాపూర్ వద్ద ఎకోటూరిజం కోసం ప్రతిపాదనలు పెట్టాను. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ చిన్నయానం వద్ద పర్యాటక కాటేజీలు నిర్మించాలని ప్రతిపాదించాను. సిద్దులగుట్ట మీద కాటేజీల నిర్మాణం కోసం రూ.15 కోట్లతో ప్రతిపాదనలు చేశాను. ఆర్మూర్ పట్టణంలో ట్యాంక్ బండ్, మున్సిపల్ భవనం కోసం ప్రతిపాదించాను.

✤ కమటం, గుంజిలి ఎత్తిపోతల పథకం, మచ్చర్ల ఎత్తిపోతల పథకం పనులు ఆగితే వాటిని పునరుద్ధరింపజేశాను. ఎత్తిపోతల మరమ్మతులు, కొత్త మోటార్ల కోసం రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పెట్టాను. కాలువల లైనింగ్స్ కోసం ప్రతిపాదనలు చేశాను. కొత్త విద్యుత్ ఉపకేంద్రాల కోసం ప్రతిపాదనలు చేశాను.

✤ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.5.15 కోట్లు, సీఆర్ఆర్ పథకం ద్వారా ఎస్సీ కాలనీల్లో రోడ్ల కోసం రూ.10 కోట్లు, ఆర్అండ్‌బీ ద్వారా సీఆర్ఐఎఫ్ ద్వారా బీటీ రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ కోసం రూ.170 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పెట్టాను. కేంద్ర ప్రభుత్వ నిధులతో పిప్రిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నాను.

✤ వ్యాపారం చేసుకునేవాళ్లు విచ్చలవిడిగా అక్రమ మొరం తవ్వుకునేందుకు అవకాశాలు ఇవ్వడం సరికాదు. స్థానికులకు సొంత అవసరాల కోసం ఉచితంగా మొరం ఇవ్వాలి. స్థానికులకు ఇవ్వకుండా, భవిష్యత్తులో స్థానికులకు మొరం లభించకుండా గుట్టలను మట్టానికి తవ్వేలా విధ్వంసకరంగా ప్రోత్సాహం ఇవ్వడం సరికాదు. ట్రిప్పుకు ఇంత మమూళ్లు అంటూ తీసుకోవడం మానుకోవాలి.

ఇన్‌చార్జులతో ఇంకెంత కాలం?

- జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఖాళీలు
- డీపీవో, డీఎల్‌పీవో, ఏవోలు ఇన్‌చార్జులే..
- డీపీవో ఆఫీస్‌లోనూ సిబ్బంది కొరత
- సమీపిస్తున్న పంచాయతీ ఎన్నికలు
- అధికారులపై తీవ్రమైన పని ఒత్తిడి



సుభాష్‌నగర్: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వచ్చే ఏడాది జనవరి 14న ప్రకటన వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారులకు సంకేతాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో కీలకపాత్ర పోషించే జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఖాళీల లోటు స్పష్టంగా కనిపిస్తోంది. కీలక పోస్టులైన డీపీవో, బోధన్ డీఎల్‌పీవో, కార్యాలయ ఏవో పోస్టులను ఇన్‌చార్జుతోనే నెట్టుకొస్తున్నారు. డీపీవో కార్యాలయంలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిబ్బంది కొరత అధికారులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఉన్న కొద్దిమందితోనే ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సి వస్తోందని ఆందోళన అధికారులు చెందుతున్నారు.

కార్యదర్శుల కొరత..

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల కొరత తీవ్రంగా ఉంది. చాలా గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో నెట్టుకొస్తున్నారు. ఎంపీడీవో, డీఎల్‌పీవో, డీపీవో కార్యాలయాల్లో సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల కొరత కూడా వేధిస్తోంది. చాలా మంది గ్రూప్–4, డీఎస్సీలో ఉద్యోగాలు రావడంతో వెళ్లిపోయారు. మరికొందరు గ్రూప్స్ పరీక్షల ప్రిపరేషన్ కోసం సెలవులో ఉన్నారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శుల స్థానంలో అవుట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకున్నారు. ఇటీవల డీపీవో కార్యాలయంలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు.

ఎన్నికల ఏర్పాట్లలో బిజీబిజీ

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను వేగవంతం చేసింది. నేడో, రేపో పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, పది రోజుల్లో ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేయాలని షెడ్యూల్ ప్రకటించింది. పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ పూర్తయ్యింది. ఎన్నికలకు సంబంధించిన సామగ్రి డీపీవో కార్యాలయంలో భద్రపర్చారు. బ్యాలెట్ ప్రింటింగ్, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ, ఇతరాత్ర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

త్వరలోనే డీపీవో నియామకం!

జిల్లా పంచాయతీ అధికారిని త్వరలో నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ పోస్టు కోసం ఒకరిద్దరు అధికారులు ప్రయత్నిస్తున్నారని చర్చించుకుంటున్నారు. డీపీవోతోపాటు మిగతా అధికారుల నియామకం కూడా త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయి అధికారుల నియామకం అవసరమని కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

మూడు నెలలుగా ఇన్‌చార్జి డీపీవో

జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ చక్రవర్తి కేంద్ర సర్వీసులకి బదిలీ కావడంతో నిజామాబాద్ డీఎల్‌పీవోగా ఉన్న శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దాదాపు మూడు నెలలుగా ఇన్‌చార్జి డీపీవోతో నెట్టుకొస్తున్నారు. డీఎల్‌పీవోగా, ఇన్‌చార్జి డీపీవోగా విధులు నిర్వర్తించడం తలకు మించిన భారంగా మారిందని శ్రీనివాస్ పలువురి వద్ద వాపోయినట్లు తెలిసింది. కార్యాలయ ఏవో సిద్ధిరాములు కూడా ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేయగా, సీనియర్ అసిస్టెంట్ కృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తరువాత ఆయనను ఆర్మూర్ డీఎల్‌పీవో కార్యాలయానికి బదిలీ చేయడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. బోధన్ డీఎల్‌పీవో సెప్టెంబర్ నెలలో బదిలీపై వెళ్లగా బోధన్ ఎంపీవోకు ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాధ్యతలు అప్పగించారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఘన స్వాగతం

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి గురువారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకోగా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్లతో సీఈవో అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయి స్థానిక అంశాలపై చర్చించారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ హనుమంతు

సమగ్ర శిక్షలో సమ్మె సైరన్

- నేడు, రేపు జిల్లా కేంద్రంలో నిరసన దీక్షలు
- 10 నుంచి సమ్మె బాటలోకి ఉద్యోగులు



జిల్లా విద్యాధికారికి సమ్మె నోటీసును అందజేస్తున్న సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు

ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టనున్నారు. ముందస్తుగా సమ్మె నోటీసును జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు అందజేసిన జేఏసీ నాయకులు విధి నిర్వహణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. శుక్ర, శనివారాల్లో జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాని పక్షంలో ఈ నెల 10 నుంచి విధులను పూర్తి స్థాయిలో బహిష్కరిస్తూ నిరవధిక సమ్మెకు దిగడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గురువారం నిజామాబాద్ జిల్లాలోని 896 మంది, కామారెడ్డి జిల్లాలోని 750 మంది ఉద్యోగులు సామూహిక సెలవులు తీసుకుంటూ అధికారులకు లీవ్ లెటర్లు అందజేసారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో భాగంగా వీరందరూ డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, కేజీబీవీ, భవిత, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. వీరికి ఏళ్ల తరబడి వేతనాల పెంపు లేకపోగా, 61 ఏళ్లు నిండగానే పదవీ విరమణ చేసి ఇంటికి పంపించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసి అమలు చేసింది. వినతులతో సమస్యల పరిష్కారం సాధ్యం కాదని భావించి రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న 20 వేలకు పైగా సమగ్ర శిక్ష ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నిజామాబాద్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమాచారం..

కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది	571
యూఆర్ఎస్, బోధనేతర సిబ్బంది	10
డీపీవో సిబ్బంది	9
ఎంఐఎస్ సమన్వయకర్తలు	22


సీసీవోలు	29	పీటీఐలు	88
సీఆర్పీలు	94	సీజీవీలు	19
ఐఈఆర్పీలు	35		
మెసెంజర్లు	19	మొత్తం	896

కామారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమాచారం

కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది	480
యూఆర్ఎస్, బోధనేతర సిబ్బంది	10
డీపీవో సిబ్బంది	7
ఎంఐఎస్ సమన్వయకర్తలు	22

సీసీవోలు	22	పీటీఐలు	71
సీఆర్పీలు	76	సీజీవీలు	18
ఐఈఆర్పీలు	26		
మెసెంజర్లు	18	మొత్తం	750


సీఎం రేవంత్‌రెడ్డి హామీ నెరవేర్చాలి



ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష పరిధిలోని అన్ని విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చెయ్యాలి. విద్యాశాఖలో వెట్టి చాకిరీ చేస్తున్న మా శ్రమ దోపిడీని సామాజిక సమస్యగా గుర్తించి మా కుటుంబాలకు న్యాయం చేయాలి.

– రాజు, అధ్యక్షుడు, జిల్లా జేఏసీ, సమగ్ర శిక్ష, నిజామాబాద్

ఇతర రాష్ట్రాల తరహాలో పర్మినెంట్ చేయాలి



దేశంలో ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సేవలను గుర్తించి పర్మినెంట్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ దిశగా అడుగులు వేయాలి. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ యథాస్థానంలో పర్మినెంట్ చేస్తూ బేషరతుగా ఉత్తర్వులు జారీ చేయాలి.

– ప్రకాష్, జేఏసీ నాయకుడు, సమగ్ర శిక్ష, నిజామాబాద్

సమగ్ర నివేదిక సమర్పిస్తాం



విన్నపాలు స్వీకరిస్తున్న బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన కలెక్టర్ హనుమంతు

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు
- స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల దామాషాపై విజ్ఞాపనల స్వీకరణ

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించేందుకు ఏర్పాటైన బీసీ డెడికేటెడ్ కమిషన్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ప్రజాభిప్రాయాలను సేకరించింది. ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాకు చెందిన కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల నుంచి కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.సైదులు రాతపూర్వకంగా విజ్ఞాపనలను స్వీకరించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న కమిషన్ చైర్మన్‌కు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, బీసీ సంక్షేమ, ముదిరాజ్, మేదరి, పూసల, వడ్డెర, చేతివృత్తుల, కుమ్మరి, యాదవ, రజక, వీరభద్రీయ, నకాశీ, వాల్మీకి, ముస్లిం మైనారిటీ, దూదేకుల, బాగ్బాన్, మేర, గాండ్ల తెలికుల, మత్స్య సహకార తదితర సంఘాల ప్రతినిధులు తమతమ కులాలవారి ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులను కమిషన్ చైర్మన్‌కు వివరిస్తూ విజ్ఞాపనలను సమర్పించారు. కులాలను ఏ,బీ సీ,డీ వర్గీకరణ చేస్తే మేలు జరుగుతుందని, బీసీలకు రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలని కోరారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఎలా ఉండాలనేదానిపై హైకోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటైందని అన్నారు. ఈ మేరకు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 8 ఉమ్మడి జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేయడం జరిగిందని, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన తరువాత సమగ్ర నివేదికను సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్‌కుమార్, కామారెడ్డి జెడ్పీ సీఈవో చందర్‌రాథోడ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవన వికాసానికి చరిత్ర పుస్తకాలే ఆధారం

నిజామాబాద్ అర్బన్: మానవ జీవన వికాసానికి చరిత్ర పుస్తకాలే ఆధారమని రాష్ట్ర బీసీ డెడికేటెడ్ కమిటీ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు అన్నా రు. బాల్కొండకు చెందిన బీఆర్ నర్సింగ్‌రావు రాసిన 'అల్లకొండ ఊరు ఉద్భవం – ఐదు ఆలయాలకు ప్రసిద్ధి' అనే పుస్తకాన్ని కలెక్టరేట్‌లో వెంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సింగ్‌రావు రచించిన పు స్తకం మామూలు పుస్తకం కాదని, విజ్ఞాన గని అని అన్నారు. చరిత్రకారులు అల్ల కొండ చరిత్రతోపాటు సోమ/ఆర్య క్షత్రీయుల పుట్టు పూర్వోత్తరాలు, పూర్వ పెళ్లి విధాన పద్ధతుల సమాచారాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ.. పుస్తక ప్రత్యేకతలను వివరించారు.

ముగిసిన శిక్షణ శిబిరం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కబడ్డీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ నెల 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే బాలికల జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలన్నారు. జట్టుకు ఎంపికైన వారిలో గోదావరి(కెప్టెన్), సాయి, దివ్య, స్నేహ, పల్లవి, మధుప్రియ, కె స్నేహ, వెన్నెల, రోహిళ, చరణ్య, సహస్ర, నికిత, తేజస్విని ఉన్నారు. కార్యక్రమంలో పీడీలు, ముప్కాల్ స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తాడ్వాయి విద్యార్థి ఎంపిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన మద్ది విశాల్‌రెడ్డి అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. విశాల్ ఇటీవల నిజామాబాద్ జిల్లా మగ్గిడిలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 10, 11 తేదీలలో మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. మాజీ సర్పంచ్ సంజీవులు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, వీడీసీ చైర్మన్ రాజు, పీడీ బాలు, తదితరులు విశాల్‌ను అభినందించారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



పిట్లం(జుక్కల్): తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజనం సమయంలో ఒప్పంద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రమబద్ధీకరించేంత వరకు కనీసం పేస్కేల్ అమలు చేస్తూ.. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని కోరారు.

25 నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

- షెడ్యూల్ ఖరారు చేసిన అధికారులు
- వారబందీ ప్రకారం ఆయకట్టుకు నీరు



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: యాసంగి పంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ఈ ఏడాది ప్రాజెక్ట్‌లోకి భారీ వరద రావడంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ఆయకట్టుకు ఈ నెల 25 నుంచి వారబందీ ప్రకారం కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని ప్రాజెక్ట్ అధికారులు నిర్ణయించారు.

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా జోన్–1, జోన్–2గా ఆయకట్టును నిర్ణయించారు. దీంతో జోన్–1కి ఏడు రోజులు, జోన్–2కి ఎనిమిది రోజులపాటు నీటిని విడుదల చేయనున్నారు. లక్ష్మి, సరస్వతి కాలువల ద్వారా వారబందీతో సంబంధం లేకుండా నిరంతరం నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

ఎల్‌ఎండీ వరకు..

ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌లో ఎల్‌ఎండీ ఎగువ భాగం వరకు మాత్రమే నీటి విడుదలను చేపట్టాలని ప్రాజెక్ట్ అధికారులు నిర్ణయించారు. కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ ఎగువ భాగన ఉన్న 4.6 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఎంత ఆయకట్టుకు నీటి సరఫరా చేశారో అంతే ఆయకట్టుకు యాసంగిలో విడుదల చేయాలని నిర్ణయించారు.

కాలువల ఆయకట్టు

కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ వరకు 4.6 లక్షల ఎకరాలు, లక్ష్మి కాలువ పరిధిలో 50 వేల ఎకరాలు, సరస్వతి కాలువ ద్వారా 50 వేల ఎకరాలు, అలీసాగర్ ఎత్తిపోతలు 57,793 ఎకరాలు, గుత్ప ఎత్తిపోతలు 38,967 ఎకరాలు, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం 11,600 ఎకరాలు, నిజామాబాద్ జిల్లాలోని 14 ఎత్తిపోతల ద్వారా 34,948 ఎకరాలు, నిర్మల్ జిల్లాలోని 9 ఎత్తిపోతల పథకాల ద్వారా 30,417 ఎకరాలకు నీటిని అందించనున్నారు.

ప్రణాళిక సిద్ధం చేశాం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌లో ఆయకట్టుకు ఈ నెల 25 నుంచి నీటి విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. వారబందీ ప్రకారం నీటి విడుదల చేపడుతాం. ఆయకట్టు రైతులు అధికారులకు సహకరించాలి.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. గురువారం తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్–14 నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థి దశలో ఎంతో కీలకమని అన్నారు. అండర్–14 నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లాలో 18 టీమ్‌లు పాల్గొనగా మొదటి స్థానం బాలుర విభాగంలో అభ్యాస పాఠశాల, రెండో స్థానంలో మిట్టాపల్లి ఉన్నత పాఠశాల, మూడో స్థానంలో సుద్దులం ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలువగా, బాలికల విభాగంలో మొదటి స్థానం సుద్దులం ఉన్నత పాఠశాల, రెండో స్థానం మిట్టాపల్లి ఉన్నత పాఠశాల, మూడో స్థానం తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాల నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం సీతాదేవి తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు.



'ట్రేలల్లో వరినారు'



రైతులు సాధారణంగా పంటపొలాల్లో వరి నారు పోసి వాటిని నాట్ల కోసం ఉపయోగిస్తారు. కానీ డొంకేశ్వర్ మండల కేంద్రంలో రైతు రవి కొత్త రకం వరినారును ట్రేలల్లో వరినారును పెంచుతున్నాడు. ఈ నారును కూలీలతో కాకుండా యంత్రం ద్వారా నాటించనున్నారు. డొంకేశ్వర్ మండల శివారులోని పంటపొలాల్లో ట్రేలల్లో వరినారు పండిస్తున్న దృశ్యం 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నేల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

- జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

డిచ్‌పల్లి: నేల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండలంలోని నడిపల్లి రైతు వేదికలో 'ప్రపంచ మృత్తిక దినోత్సవ' వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, కృషి విజ్ఞాన కేంద్రం(రుద్రూర్) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ అంజయ్య, నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ హాజరై మాట్లాడారు.

నేల సంరక్షణ ఆవశ్యకత, వరి మొదళ్లను కాల్చడంతో వచ్చే నష్టాలు, వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, డిచ్‌పల్లి మండల వ్యవసాయాధికారి సుధామాధురి, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని పరిధిలోని పీజీ, ఎల్‌ఎల్‌బీ రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు ఈ నెల 12న సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ అరుణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ 1, 2, 3, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలు(నవంబర్/ డిసెంబర్)లో ప్రకటించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.500 రీవాల్యుయేషన్ ఫామ్‌కు రూ.25లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి



నవీపేట: గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన క్లోరినేషన్ చేసిన తాగునీటిని అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శివకృష్ణ అన్నారు. గురువారం ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా నవీపేట మండలంలోని అభంగపట్నం జీపీలో తాగునీటి వాటర్ ట్యాంకు పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి రామకృష్ణ, అభంగపట్నం జీపీ కార్యదర్శి ప్రియాంక, సిబ్బంది ఉన్నారు.

ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలపై నివేదిక అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న విజయభాస్కర్

బాల్కొండ: పదోతరగతి పరీక్షా కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై వెంటనే సమగ్ర నివేదిక అందించాలని ఎంఈవో రాజేశ్వర్‌ను రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి విజయభాస్కర్ అన్నారు. గురువారం బాల్కొండ, కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాలు గల పాఠశాలల వివరాలను, వసతల గురించి పూర్తి నివేదిక వెంటనే అందించాలన్నారు. ఆయన వెంట ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ఉపాధి కోసం వెళ్లి.. కనిపించకుండా పోయి..



గల్లంతైన తమవారి ఆచూకీ కనిపెట్టాలని ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు

- థాయిలాండ్‌లో గల్లంతైన ఇద్దరు వలస కార్మికులు
- బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు
- ఏజెంట్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

మోర్తాడ్ (బాల్కొండ): వీసాల కోసం డబ్బులు వసూలు చేసి వంచించడం, పని చేయించుకుని జీతాలు ఎగ్గొట్టడం, వర్క్ వీసాలకు బదులు విజిట్ వీసాలపై విదేశాలకు పంపించడంలాంటి మోసాలు ఇప్పటి వరకు విన్నాం. తాజాగా ఏజెంట్ల మోసంతో మనుషుల జాడనే కనిపించకుండా పోతున్న విషయం వెలుగులోకి వచ్చింది. సొంతూరిలో సరైన పని లేకపోవడంతో ఉపాధి దొరుకుతుందనే ఆశతో ఏజెంట్ల మాయమాటలు నమ్మి గల్లంతైన ఇద్దరు వ్యక్తుల జాడ కోసం వారి కుటుంబాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి చెందిన కొండ్ర సాగర్, జగిత్యాల్ జిల్లా కోరుట్ల మండలం మోహన్‌రావుపేట్‌కు చెందిన శనిగరపు అరవింద్ నవంబర్ 11న థాయిలాండ్‌కు వెళ్లారు. మొదట్లో తమ కుటుంబ సభ్యులతో ప్రతి రోజు ఫోన్‌లో మాట్లాడిన ఇద్దరు అదే నెల 21 నుంచి ఎలాంటి ఫోన్ చేయడం లేదు. కనీసం సమాచారం పంపించడం లేదు. తమవారి ఆచూకీ లేకుండా పోవడానికి కారణం ఏజెంట్ సమ్మెట రాజు అని గుర్తించిన గల్లంతైన వారి భార్యలు కాశమ్మ, జల ఇటీవల ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

వేగంగా విచారణ..

గల్లంతైన తమవారి ఆచూకీ తెలుసుకోవాలని కాశమ్మ, జల ఇచ్చిన వినతి పత్రానికి గ్రీవెన్స్ సెల్ అధికారిణి దివ్యా దేవరాజన్ వెంటనే స్పందించారు. ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారిణి శిఖాగోయల్‌కు బాధిత మహిళల ఆవేదనను దివ్యా దేవరాజన్ వివరించారు. ఆమె పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో జగిత్యాల్ జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన సమ్మెట రాజును వలపన్ని పట్టుకున్నారు. బుధవారం మోర్తాడ్ పోలీసు స్టేషన్‌కు తరలించి ఇక్కడ కేసు నమోదు చేయించారు. ఏజెంట్‌ను రిమాండ్ చేశారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం పోలీసులు ఏజెంట్‌ను విచారించారు. థాయిలాండ్‌లోని మరో ఏజెంట్ మున్నాను సంప్రదించి సాగర్, అరవింద్‌ల ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

థాయిలాండ్‌లోని మన విదేశాంగ శాఖ అధికారులతోను సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సంప్రదింపులు ఆరంభించారు. తొందరలోనే ఇద్దరి ఆచూకీ తెలుసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఏది ఏమైనా ఏజెంట్ల మోసాలకు తెలంగాణ జిల్లాలకు చెందిన వలస కార్మికులు ఏదో ఒక విధంగా మోసపోతూనే ఉన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



కొండా పవన్ కుమార్(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కేపీఆర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన కొండా పవన్ కుమార్(42) రెండేళ్ల క్రితం కామారెడ్డికి వచ్చి వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కేపీఆర్ కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వరకు బ్యాంకు రుణం, ఇతర అప్పులు చేశాడు. పని సరిగ్గా లేకపోవడం, అప్పులు, వాయిదాలు కట్టలేక కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

87 వాహనాలు సీజ్



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో సబ్ డివిజన్‌లోని ఆయా పీఎస్‌ల అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, నంబర్ ప్లేట్, హెల్మెట్, డ్రంకన్ డ్రైవ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేశారు. వాహన ధ్రువపత్రాలు సక్రమంగా లేని మొత్తం 87 వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

రెంజల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.మండలంలోని కందకుర్తి నుంచి పేపర్‌మిల్ గ్రామానికి బుధవారం అర్ధరాత్రి మూడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ల వద్ద ఇసుక అనుమతికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాహనాలను పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

రెండు ఇసుక లారీలు..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకుని సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలించడంతో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ శివారులో ఉన్న భూవివాదంలో తలెత్తిన ఘర్షణలో పరస్పరం ఫిర్యాదులు అందడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిక వివరాల ప్రకారం.. తన భూమి కబ్జా ప్రయత్నాన్ని అడ్డుకున్నందుకు మధుసూదన్‌రెడ్డి, నల్ల హరీశ్‌రెడ్డి, నల్ల నరేశ్‌రెడ్డి దాడికి పాల్పడ్డారని బొడ్డు గంగారెడ్డి, ఆయన కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారని తెలిపారు. వారి నుంచి ప్రాణహాని ఉందని, తనకు న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారందరిపై కఠినచర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బొడ్డు గంగారెడ్డి, కౌలుదారుడు గుండు నాయక్, డ్రైవర్ శుభంతోపాటు మరికొందరిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.

జేసీబీ, టిప్పర్లు స్వాధీనం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎత్తొండ క్యాంపు శివారులో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా ఉన్న జేసీబీ, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ గురువారం పేర్కొన్నారు. తగుచర్య నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

రుద్రూర్: చోరీ కేసులో నిందితుడు అశోక్‌కు ఏడాది జైలు శిక్షను బోధన్ అడిషనల్ జడ్జి ఈ సాయిశివ విధించారని ఎస్సై సాయన్న గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2017నవంబర్19న రుద్రూర్ గ్రామానికి చెందిన మోత్కురి శశికళ ఇంట్లో మూడు తులాల బంగారాం, పది తులాల వెండి ఆభరణాలు, రూ. వెయ్యి నగదు చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బోధన్‌కు చెందిన ఎ అశోక్‌ను అరెస్ట్ చేసి చోరీకి గురైన వస్తువులను రికవరీ చేసి చార్జిషీట్ వేశారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

జానకంపేటలో బైక్ చోరీ

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన జి విజయ్ తన బైక్‌ను గురువారం ఉదయం ఇంటి ఎదుట నిలుపగా దుండగులు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. అదే విధంగా గ్రామానికి చెందిన ఇద్దరి బైకులు సైతం మంగళవారం చోరీకి గురికాగా ఒకరి బైక్ సాయంత్రానికి దొరకగా మరొకరి బైక్ దొరకలేదు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

డీఆర్‌డీవో సురేందర్



భూమి పూజ చేస్తున్న డీఆర్‌డీవో సురేందర్

కామారెడ్డి రూరల్: రైతులు తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. నర్సన్నపల్లిలో గురువారం చిదుర శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఫిష్ పాండ్‌లో 1500 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ఒక ఎకరం, భాస్కర్ రెడ్డి ఒక ఎకరం పొలంలో మునగ తోట వేయడానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా కొటాల్‌పల్లికి చెందిన గోపాల్ కూరగాయలు, మునగ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. రైతులు ప్యాడి తగ్గించి తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే మార్గాలను ఎంచుకోవాలన్నారు. చిదుర శ్రీనివాస్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని గ్రామానికి చెందిన మిగితా రైతులు కూడా చేపల పెంపకాన్ని చేపడితే బాగుంటుందని అన్నారు. రైతుకు సహకరించిన ఎంపీడీవో నాగవర్ధన్‌ను డీఆర్‌డీవో ఈ సందర్భంగా అభినందించారు. ఐకేపీ ఏపీఎం మోహిజ్, సీసీ విశ్వనాథం, ఏపీవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జి మేనేజర్ అరెస్ట్

జక్రాన్‌పల్లి: మైనర్ బాలిక అత్యాచారం కేసులో నిందితుడికి సహకరించిన నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటసాయి లాడ్జి మేనేజర్ సత్యనారాయణను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపారు. పోక్సో కేసులో నిందితుడికి వెంకటసాయి లాడ్జ్ రూం ఇచ్చాడు. అక్టోబర్ 1న ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన అజయ్ జక్రాన్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నిర్మల్‌లోని వెంకట సాయిలాడ్జికి తీసుకెళ్లాడు. మేనేజర్ సత్యనారాయణ నిందితుడి వద్ద ఎక్కువ డబ్బులు తీసుకుని ఓనర్‌కు తెలియకుండా రూం ఇచ్చాడు. నిందితుడు బాలికపై అత్యాచారం చేశాడు. అక్టోబర్ 30న బాధితురాలి ఫిర్యాదు మేరకు జక్రాన్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు అజయ్‌ని అక్టోబర్ 31న పట్టుకుని జైలుకు పంపించారు. నిందితుడు తెలిపిన ఇతర ఆధారాల ప్రకారం వెంకటసాయి లాడ్జి మేనేజర్ సత్యనారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జిల్లా చుట్టు పక్కల ప్రాంతాల్లో లాడ్జి, హోటళ్ల నిర్వాహకులు అమ్మాయిలను లాడ్జికి తీసుకొచ్చే వారికి రూంలు ఇవ్వొద్దని సూచించారు. ఎవరైన డబ్బులకు ఆశపడి ఇలాంటి నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.